సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



ఉత్పత్తికి సహకరించండి

ఉక్కు ఉత్పత్తికి అవసరమైన కోల్, కోక్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఉక్కు కార్మిక సంఘ నేతలు కలెక్టర్ మల్లికార్జునను కోరారు. 8లో

సిరులతల్లికి పద్మారాధన



విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ

విశాఖ: రైఫిల్ షూటింగ్ జాతీయ స్థాయి ఎంపికలకు వెళుతున్న ఏయూ విద్యార్థులను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

న్యూస్‌రీల్

సింహగిరిపై వేడుకలకు శారదా పీఠాధిపతికి ఆహ్వానం



ఆహ్వానపత్రిక అందిస్తున్న సింహాచలం ఈవో

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 19న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి, మే 10న చందనోత్సవానికి విచ్చేయాల్సిందిగా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి సింహాచలం దేవస్థానం ఆహ్వానం పలికింది. ఈ మేరకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి చినముషిడివాడలోని శారదాపీఠానికి వెళ్లి స్వామీజీకి ఆహ్వానపత్రిక అందజేశారు. కల్యాణోత్సవం, చందనోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు వివరించారు. ఈవో వెంట సింహాచలం దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో వి.బి.వి. రమణమూర్తి ఉన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలని మొక్కుకున్నా..

- అరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి తనూజారాణి

మహారాణిపేట : మళ్లీ జగనే సీఎం కావాలని మొక్కుకున్నట్లు అరకు వైఎస్సార్‌సీపీ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ తనూజారాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ అఫీషియల్ కాలనీలోని బెల్లం వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తన తండ్రికి స్టెంట్ వేసినప్పుడు బెల్లం వినాయకుడి గుడికి వచ్చి మొక్కుకున్నానని, ఇప్పుడాయన ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యంగా ఉండి, మళ్లీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌పై ప్రతిపక్షాలు విసిరిన రాయి వారి సమాధి రాయి అవుతుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతంలో ఇంతటి అభివృద్ధి చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని డాక్టర్ తనూజరాణి తెలిపారు.

రాజకీయంగా ఎదుర్కొనలేకనే జగనన్నపై దాడి



జగనన్నపై దాడిని నిరసిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: జగనన్నను రాజకీయంగా ఎదుర్కొనలేకనే చంద్రబాబు ఇటువంటి నీచమైన దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు విమర్శించారు. సీఎంపై రాయి దాడికి నిరసనగా గాయపడిన జగనన్న ఫొటోలతో కూడిన కరపత్రాలతో మంగళవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ జగనన్నపై దాడులను ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల నేతలు జయదేవ్, రాంప్రసాద్, జగబంధు, దాసు, సన్యాసిరావు, పులిరాజు, జగన్నాథం పడాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాత్రి సర్వీసులు పునరుద్ధరణ

సీలేరు: సీలేరు మీదుగా విశాఖపట్నం, భద్రాచలం నడిచే రాత్రి సర్వీసులు, నైట్ హాల్ట్ సర్వీసులను బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు పీటీడీ అధికారులు తెలిపారు. సీపీఐ మావోయిస్టు పార్టీ ఈ నెల 13 నుంచి 16 వరకు బంద్‌కు పిలుపు నిచ్చిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా వీటిని నిలిపివేయడం తెలిసిందే. బంద్ ముగిసిన నేపథ్యంలో సర్వీసులను పునరుద్ధరిస్తున్నారు.

ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య

సాక్షి,పాడేరు: పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పీఈఎన్) ఉండాలని డీఈవో బ్రహ్మాజీరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటవ తరగతి నుంచి అడ్మిషన్ సమయంలో శాశ్వత విద్యా నెంబర్ విద్యార్థికి కేటాయించాలని, వారి చదువు పూర్తయ్యే వరకు ఆ సంఖ్య ఉంటుందన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థులపై తరగతులకు ప్రమోట్ చేయడం, ఇతర పాఠశాలలకు బదిలీ చేసేందుకు ఈ సంఖ్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రికార్డు షీటు, టీసీ, కుల, జనన ధ్రువీకరణ పత్రాల కోసం పట్టుబట్టకుండా ఈ సంఖ్య ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని ఆయన ఎంఈవోలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. భారత ప్రభుత్వం యూడైస్ పోర్టల్ ద్వారా విద్యా సంఖ్యను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

గీత.. ఎదురీత



అరకు పార్లమెంట్ పరిధిలో ఏమాత్రం క్యాడర్‌లేని బీజేపీ ఈ ఎన్నికల్లో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2019 ఎన్నికల్లో నేరుగా పోటీచేస్తే కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదు. 2014 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చినా ఓటమి తప్పలేదు. వైఎస్సార్‌సీపీ 2014 ఎన్నికల్లో 91,398 ఓట్లు, 2019లో 2,23,999 ఓట్ల ఆధిక్యతతో అరకు ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పరిస్థితుల్లో కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కొత్తపల్లి గీతకు మిగతా పార్టీల శ్రేణుల నుంచి సహకారం లభించే పరిస్థితి కానరావడం లేదు.

- అరకు పార్లమెంట్‌లో బీజేపీకి గడ్డు పరిస్థితి
- టీడీపీ, జనసేన నుంచి కానరాని సహకారం
- 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి భారీ ఆధిక్యత
- గిరిజనులకు జగనన్నపై తరగని అభిమానం
- గ్రామస్థాయిలో మరింత పటిష్టం

రంపచోడవరం: అరకు పార్లమెంట్ పరిధిలో ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలు పాలకొండ, కురుపాం, సాలూరు, అరకువేలీ, పాడేరు, రంపచోడవరంతో పాటు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం పార్వతీపురం ఉంది. వైఎస్సార్ సీపీ పార్టీ ఆవిర్భావం నాటి నుంచి గిరిజనులు జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారు. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరపున అరకు ఎంపీ సీటును బీజేపీకి కేటాయించారు. గత రెండు దఫాల ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఆ పార్టీ పరిస్థితి దయనీయంగానే ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అభ్యర్థి కొత్తపల్లి గీతకు వ్యతిరేకంగా గిరిజన సంఘాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. గిరిజన వ్యతిరేకి అయిన ఆమెను ఓడించాలని పిలుపునిస్తున్నాయి.

కూటమిపైనే ఆశలు..

అరకు పార్లమెంట్ పరిధిలో బీజేపీకి సొంత బలం లేకపోయినా సీట్లు సర్దుబాటులో భాగంగా టికెట్ దక్కించుకున్నా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ పార్లమెంట్‌లోని అసెంబ్లీల పరిధిలో ఆ పార్టీకి పెద్దగా క్యాడర్ కూడా లేదు. టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్నా ఆ పార్టీ శ్రేణులు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు.

2014లో వైఎస్సార్‌సీకి 91,398 ఓట్ల ఆధిక్యత..

2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 4,13,191 ఓట్లు దక్కించుకుని విజయం సాధించింది. టీడీపీ, బీజేపి ఉమ్మడి అభ్యర్థికి 3,21,793 ఓట్లు, కాంగ్రెస్‌కు 52,884 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 91,398 ఓట్ల మెజారిటీ వచ్చింది. రెండు పార్టీల ఓట్లు కలిపితే 3,74,677 ఓట్లు వచ్చాయి. ఇలా రెండింటిని కలిపినా వైఎస్సార్‌సీకి 38,514 ఓట్ల ఆధిక్యత ఉంది.

2019లోనూ 2,23,999 ఓట్ల మెజారిటీ..

2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎటువంటి పొత్తులు లేకుండా ఒంటరిగా ఎన్నికల బరిలో నిలవగా కేవలం 17,867 ఓట్లు మాత్రమే సాధించింది. అంటే నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ 5,62,190 ఓట్లు సాధించగా టీడీపీకి 3,38,101, జనసేనకు 42,794 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 2,24,089 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. ఈ రెండు దఫాల ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే బీజేపీకి సొంత బలం లేనట్టేనని స్పష్టమవుతోంది.

బలమైన పార్టీగా..

అరకు పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయిలో మరింత పటిష్టంగా ఉంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలో ఒక అసెంబ్లీ స్థానం మినహా అన్నింటిని కైవసం చేసుకుంది. 2019 ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ స్థానాలను దక్కించుకుని క్షేత్రస్థాయిలో మన్యంలో బలమైన పునాది వేసింది.

కూటమి క్యాడర్ చెల్లాచెదురు

అరకు పార్లమెంట్ పరిధిలోని రంపచోడవరం, అరకువేలీ, పాడేరు నియోజకవర్గాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన (కూటమి) పార్టీల క్యాడర్ వర్గపోరు కారణంగా చెల్లాచెదురైంది. టీడీపీ విషయానికొస్తే రెండుగా చీలిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ఎంపీ అభ్యర్థి (బీజేపీ) కొత్తపల్లి గీతకు ఎంతవరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకమే.

- అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీకి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు సివేరి అబ్రహం, సియ్యారి దొన్నుదొర తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. దీనివల్ల ఆ పార్టీ ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటోంది.
- పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆ పార్టీ అధిష్టానంపై కారాలు మిరియాలు నూరుతున్నారు. రెబల్‌గా పోటీచేసి అమీతుమీ తేల్చుకుంటానని ఆమె ఇప్పటికే హెచ్చరించారు.
- రంపచోడవరం అసెంబ్లీ మిరియాల శిరీషాదేవికి టికెట్ కేటాయింపు నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు అరకు ఎంపీ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై గుర్రుగా ఉన్నారు. ఈ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరితోపాటు మరో మాజీ ఎమ్మెల్యే కూడా ఆశించారు. వీరి కాకుండా పార్టీలోకి కొత్తగా వచ్చిన మిరియాల శిరీషా దేవికి టికెట్ కేటాయింపుపై వారు జీర్ణించుకోలేకపోతున్నారు. శిరీషకు సహకరించేది లేదని వారి అనుచరులు ఇప్పటికే ప్రకటించారు. కూటమి అభ్యర్థికి అరకు, పాడేరు, రంపచోడవరంలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి.

నామినేషన్లకు సర్వం సిద్ధం

- అరకు పార్లమెంట్, పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు రేపటి నుంచి 25 వరకు స్వీకరణ
- ఈనెల 26న పరిశీలన
- 29న ఉపసంహరణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా అధికార యంత్రాంగం



సూచనలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: వచ్చేనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలకఘట్టం ఆసన్నమైంది. జిల్లాలో అరకు పార్లమెంట్, పాడేరు, రంపచోడవరం, అరకులోయ అసెంబ్లీ స్థానాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా తేదీల మధ్య సెలవు రోజుల్లో మినహా మిగతా రోజుల్లో ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ తరువాత 26వ తేదీన ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను పరిశీలిస్తారు. సక్రమంగా ఉన్న అభ్యర్థుల వివరాలను ఆర్వోలు ప్రకటిస్తారు. 29వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 లోపు మాత్రమే నామినేషన్లను ఉపసంహరించుకోవాలి.

ఆన్‌లైన్‌లోను నామినేషన్‌కు అవకాశం

భారత ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించింది. అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సువిధా యాప్ souvidha.gov.in ద్వారా కూడా నామినేషన్లను నిర్ణీత గడువులోగా దాఖలు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో సమర్పించిన ఫారం-2బి, ఇతర ఫిజికల్ కాపీలను ప్రింట్ తీసి రిటర్నింగ్ అధికారికి తప్పనిసరిగా సమర్పించాలి. లేనిపక్షంలో సంబంధిత నామినేషన్లు తిరస్కరణకు గురవుతాయి.

నామినేషన్లు స్వీకరించే కేంద్రాలు.. అధికారులు

అరకు పార్లమెంట్‌కు సంబంధించి పార్వతీపురం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్, పాడేరు అసెంబ్లీకి సంబంధించి పాడేరు కలెక్టరేట్ జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్, ఆర్వో భావన వశిష్ట, అరకు అసెంబ్లీకి సంబంధించి పాడేరు ఐటీడీఏలో పీవో, ఆర్వో వి.అభిషేక్, రంపచోడవరం అసెంబ్లీకి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్, ఆర్వో ప్రశాంత్ కుమార్ నామినేషన్లను స్వీకరిస్తారు.

నిబంధనలివీ..

- నామినేషన్ దాఖలు సమయంలో భారత రాజ్యాంగానికి లోబడి వ్యవహరిస్తానని ప్రమాణ పత్రం సమర్పించాలి
- పార్లమెంట్‌కు సంబంధించి దేశంలోను, అసెంబ్లీకి సంబంధించి రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండవచ్చు.అయితే సొంత నియోజకవర్గం నుంచి కాకుండా ఇతర చోట్ల పోటీ చేస్తే ఓటు హక్కు ఉన్నట్టు ధ్రువపత్రాన్ని నామినేషన్‌కు దాఖలు చేయాలి.
- పోటీ చేసే అభ్యర్థి నియోజకవర్గంలో ఓటరు కాకుంటే సర్టిఫికెట్ ఆఫ్ ఎలక్ట్రోరల్ రోల్ ధ్రువపత్రాన్ని నామినేషన్‌తో పాటు సమర్పించాలి
- అభ్యర్థులు..ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేసినా ప్రతిపాదించే వారు మాత్రం అదే నియోజకవర్గ పరిధిలోని ఓటరు అయి ఉండాలి.
- గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు పది మంది, జాతీయ,రాష్ట్ర స్థాయి పార్టీల అభ్యర్థులకు అయితే ఒకరు ప్రతిపాదించాలి.
- అరకు పార్లమెంట్‌తో పాటు అరకులోయ, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలు ఎస్టీ రిజర్వ్ కావడంతో పార్లమెంట్‌కు పోటి చేసే అభ్యర్థులు రూ.12,500,అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు రూ.5 వేలు నామినేషన్ సమయంలో డిపాజిట్ చేయాలి
- రిజర్వ్‌డు స్థానాలు కావడంతో అభ్యర్థులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు నామినేషన్‌తో పాటు సమర్పించాలి
- అభ్యర్థి నామినేషన్‌తో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను అందజేయాలి. ఇవి మూడు నెలలు ముందుగా తీసుకున్నట్టు డిక్లరేషన్ సమర్పించాలి.
- గుర్తింపు పొందిన/పొందని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫారం-ఏ,ఫారం-బీలను నామినేషన్‌తో పాటు సమర్పించాలి.లేదా నామినేషన్ చివరి రోజు మధ్యాహ్నం 3గంటల లోపు ఆర్వోకు అందజేయాలి.
- నామినేషన్లు దాఖలు సమయంలో అభ్యర్థులు తమ ర్యాలీలకు ముందస్తు అనుమతి తీసుకోవడంతో పాటు ఆర్వో కార్యాలయానికి 100మీటర్ల దూరం అవతల వరకు మాత్రమే ర్యాలీ నిర్వహించాలి.
- నామినేషన్ సమయంలో ఆర్వో కార్యాలయం వరకు అభ్యర్థి తరఫున మూడు వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తారు.

పటిష్ట భద్రత మధ్య ఎన్నికల నిర్వహణ





ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

- కలెక్టర్ విజయ సునీత
- రంపచోడవరంలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

రంపచోడవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను పటిష్ట భద్రత మధ్య ప్రశాంతంగా నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ విజయ సునీత పేర్కొన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాడ్ల భద్ర పరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను, గిరిజన గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు భద్ర పరిచే గదిని, కౌంటింగ్ నిర్వహించే హాళ్లను ఆమె మంగళవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ ఆవరణలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, బందోబస్తు వివరాలను ఆమె తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూం ఆవరణలోకి ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దని ఆమె ఆదేశించారు. హెలిప్యాడ్ ల్యాండింగ్, వాహనాల పార్కింగ్‌ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 399 పోలింగ్ కేంద్రాలు, 59 మంది సెక్టోరల్ అధికారులు, 73 మంది రూట్ అధికారులను నియమించినట్టు చెప్పారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 518 ఈవీఎంలు, 518 వీవీ ప్యాడ్లు, 518 కంట్రోల్ యూనిట్లు, 518 బ్యాలెట్ యూనిట్లను అసెంబ్లీకి, పార్లమెంట్‌కు వేర్వేరుగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచనట్టు కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి, సీఐ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పటిష్ట భద్రత



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో అభిషేక్

అరకులోయ రూరల్: ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి సూచనలిచ్చారు.

పెట్రోల్ కూపన్ల కోసం పడిగాపులు

- బీజేపీ ప్రచార ర్యాలీకి వచ్చిన కూటమి శ్రేణుల అవస్థలు
- అరకొరగా కూపన్లు ఇవ్వడంతో అసహనం
- టీడీపీ సీనియర్ నేతపై ధ్వజం



పెట్రోల్ కూపన్లకోసం బంక్‌లో వేచి ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

అరకులోయ టౌన్: అరకు ఎంపీ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, అసెంబ్లీ అభ్యర్థి పాంగి రాజారావు మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీకి వచ్చిన కూటమి పార్టీల శ్రేణులు పెట్రోల్ కూపన్లకోసం పడిగాపులు పడ్డారు. ర్యాలీలో పాల్గొనే బైక్‌లు, ఆటోలకు పెట్రోల్ వేయిస్తామని స్థానిక నేతల ద్వారా కార్యకర్తలకు సమాచారం పంపారు. ఈ మేరకు వచ్చిన పార్టీ శ్రేణులు స్థానిక బంక్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెట్రోల్, డీజిల్ కూపన్లకోసం వేచి ఉండాల్సి వచ్చింది. వీరిలో గన్నెల తదితర ప్రాంతాలకు చెందిన వారికి కూపన్లు అందకపోవడంతో అసహనానికి గురయ్యారు. పంచాయతీ నేతలకు బాధ్యతలు అప్పగించి ఇలా చేయడం సరికాదని అరకు మండలానికి చెందిన ఓ సీనియర్ టీడీపీ నేతపై వారు ధ్వజమెత్తారు. ర్యాలీ అనంతరం అభ్యర్థి కొత్తపల్లి గీత పద్మాపురంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి జరగలేని ఆమె పేర్కొన్నారు. దీంతో ఎంపీగా పనిచేసిన సమయంలో అభివృద్ధిని విస్మరించిన మీరు ఈరోజు ఎలా ఓట్లు అడుగుతారని ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయని విలేకరులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆమె సమాధానం చెప్పకుండా దాటవేశారు.

సీతారాముల కల్యాణానికి
శ్రీరామగిరి ముస్తాబు



శ్రీరామగిరిపై విద్యుత్ దీపకాంతులతో శ్రీసుందర సీతారామచంద్ర స్వామివారి ఆలయం

వీఆర్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామగిరి కొండమీద కొలువైన శ్రీసుందర సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో పెళ్లిసందడి నెలకొంది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు ఆలయంలో అధ్యయనోత్సవాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి కల్యాణం కొండ దిగువున కల్యాణ మండపంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు తెలిపారు. కల్యాణ ఏర్పాట్లను తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ మంగళవారం పరిశీలించారు. ముఖ్యంగా భక్తులు తరలివచ్చే గోదావరి బోట్ పాయింట్ వద్ద తగిన భద్రత ఏర్పాట్లు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు.

ఎటపాకలో వేడుకలకు సిద్ధం

ఎటపాక:శ్రీరామనవమి వేడుకలకు జటాయువు మండపం, ఉష్ణగుండాల పవిత్ర గోదావరి నదిలో వేడినీళ్ల బావి వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. సరిహద్దు తెలంగాణలోని సమీప భద్రాచలం దేవస్థానంలో బుధవారం జరిగే కల్యాణ ఉత్సవాలకు వచ్చే భక్తులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు.

జటాయువు విశిష్టత


సీతారాముల వనవాస సమయంలో సీతమ్మ వారు పర్ణశాల కుటీరంలోనే తలదాచుకున్నారు. మారువేషంలో వచ్చిన రావణాసురుడు ఇక్కడనే సీతమ్మ వారిని అపహరించారు. సీతమ్మవారిని ఆకాశ మార్గాన ఎత్తుకెళ్తున్న సమయంలో జటాయువు అనే పక్షి రావణాసురుడిని నిలువరించేందుకు భీకర పోరాటం చేసిన క్రమంలో ఆ పక్షి రెక్క ఒకటి తెగి పడిన ప్రదేశమే ఎటపాక. మొదట్లో ఝటాయుపాక.. కాలక్రమేణా జటపాక, ఎటపాకగా రూపాంతరం చెందింది. పక్షి కాలుపడిన గుర్తులు నేటికీ ఇక్కడ పదిలంగా ఉన్నాయి. అదేచోట చిన్నపాటి మండపాన్ని గ్రామస్తులే నిర్మించారు. ఆ మండపంలోనే నవమి, ముక్కోటి రోజున భద్రాద్రి దేవస్థానం అర్చకులు వేడుకలు నిర్వహిస్తుంటారు.

ఉష్ణగుండాల ప్రాశస్త్యం

సీతమ్మ వారు వనవాస సమయంలో గోదావరిలో స్నానమాచరించే క్రమంలో చన్నీళ్లు పోసుకునేందుకు కొంత అసౌకర్యానికి గురైందని చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో లక్ష్మణుడు తన విల్లంబును ఇసుక తిన్నెల్లో ఎక్కుపెట్టి సంధించగా అక్కడ వేడి నీళ్లు వచ్చాయని ప్రతీతి. ఆ ప్రాంతంలోని గోదావరి ఇసుక తిన్నెల్లో బావి తీస్తే ఇప్పుడు కూడా వేడి నీళ్లు వస్తుంటాయి. ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వేడినీటిని తలపై చల్లుకుంటారు.



ఎటపాకలోని జటాయువు మండపంలో స్వామి వారి విగ్రహాలు



ఉష్ణగుండాల గోదావరి నదిలో వేడినీళ్ల బావిని దర్శించుకున్న భక్తులు



శ్రీరామగిరిలోని బోట్ పాయింట్ వద్ద పరిశీలన చేస్తున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

టీడీపీ, సీపీఎం నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీలో టీడీపీ, సీపీఎంకు చెందిన పలువురు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కొండిబ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గెజ్జెల త్రినాథ్, బొరిబొరివలసలో సీపీఎంకు చెందిన వార్డు సభ్యుడు సమర్ది రామ్మూర్తి కుటుంబీకులు తదితరులు ఎంపీపీ శెట్టి నీలవేణి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. అలాగే అభివృద్ధికి పట్టం కట్టేందుకు గిరిజనులంతా సిద్ధం ఉన్నారని తెలిపారు. అనంతరం సింగర్బం, మువ్వంవలస, టోకూరు, నడిమివలస గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, సర్పంచ్ సింహాద్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, కన్వీనర్ రాజ్‌కుమార్, అప్పన్న, రాజు పాల్గొన్నారు.



టీడీపీ, సీపీఎం నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, తదితరులు

క్లుప్తంగా

వైభవంగా మారెమ్మ ఉత్సవం

సీలేరు: మారెమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి గరగాలంకరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మారెమ్మ అమ్మవారి మాలధారులు అగ్ని గుండం తొక్కారు. డొంకరాయికి చెందిన తమిళ పూజారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి మాలధారులకు కంకణాలు కట్టారు. అనంతరం సీలేరు నది ఒడ్డుకు చేరుకొని గరగాలంకరణ చేశారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బాణాసంచా కాల్చారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఆర్‌పీఎఫ్ డిఎస్పీ సురేష్, ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఉత్పత్తికి సహకరించండి

- కలెక్టర్‌కు కార్మిక సంఘాల వినతి

ఉక్కునగరం: ఉక్కు ఉత్పత్తికి అవసరమైన కోల్, కోక్ సరఫరా సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి సహకరించాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాయకులు కలెక్టర్ మల్లికార్జునను కలిసి, వినతిపత్రం అందజేశారు. గత వారం రోజులుగా గంగవరం పోర్టు ప్లాంట్‌కు కోల్, కోక్ సరఫరా నిలిపివేసిందన్నారు. ఫలితంగా ఉక్కు ఉత్పత్తి పడిపోయిందన్నారు. కోల్ సరఫరా లేకపోవడం వల్ల కోక్‌ఓవెన్స్ నుంచి సరిపడా గ్యాస్ ఉత్పత్తి కాకపోవడంతో ఇతర ఉత్పత్తి విభాగాల్లోనూ ఉత్పత్తికి అంతరాయం కలుగుతోందని, తద్వారా మరింత నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్లాంట్‌ను రక్షించాలని లేఖలో కోరారు. అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్ పాల్గొన్నారు.

మంచి ముహూర్తానికి..!

- నామినేషన్లకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- రేపటి నుంచి 25 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు
- 18 నుంచి 24 వరకు సుముహూర్తాలు



సాక్షి, విశాఖపట్నం : నామినేషన్ల హడావుడి గురువారం నుంచి ప్రారంభమకానుంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల సమర్పణకు అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ మధ్య కాలంలో ఏరోజు ముహూర్తం బాగుందో తెలుసుకుని, ఆరోజు నామినేషన్లు వేయాలని చాలామంది అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే రాజకీయ నాయకులు మంచి ముహూర్తాల కోసం పండితులు, సిద్ధాంతులను ఆశ్రయిస్తున్నారు. ఆయా అభ్యర్థుల జాతక చక్రాలు, నామ/జన్మ నక్షత్రాలకు అనుగుణంగా వీరు ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. పంచాంగం ప్రకారం చూస్తే ఈనెల 18, 19, 22, 23, 24 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. ఇప్పటికే ఉమ్మడి విశాఖలో సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చాలావరకు ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. అభ్యర్థుల జాతకంలో రవి గ్రహం, రవి, కుజ, శని గ్రహాలు బలంగా ఉంటే విజయావకాశాలు మెండుగా ఉంటాయని చెబుతారు. అందువల్ల అలాంటి ముహూర్తాలు ఏ సమయంలో ఉన్నాయో పరిశీలించి నిర్ణయం జరుగుతుందని విశాఖకు చెందిన స్మార్త పురోహితుడు చేబియ్యం రవిశర్మ 'సాక్షి'కి చెప్పారు. కొంతమంది అభ్యర్థులు మంచి ముహూర్తాలకు, మరికొందరు సెంటిమెంటుతో పాటు వారాలకు ప్రాధాన్యతనిస్తారని అందుకనుగుణంగా శుభగడియలను పడికట్టి ముహూర్తాలను నిర్ణయిస్తామని కేవీకే శాస్త్రి అనే మరో పురోహితుడు తెలిపారు.

ఏ రోజు ఎవరు నామినేషన్?

తేదీ	నియోజకవర్గం	అభ్యర్థి పేరు	పార్టీ
24.4.24	అనకాపల్లి (లోక్‌సభ)	బూడి ముత్యాలనాయుడు	వైఎస్సార్‌సీపీ
19.4.24	యలమంచిలి	యూవీ రమణమూర్తిరాజు	వైఎస్సార్‌సీపీ
22.4.24	పాయకరావుపేట	కంబాల జోగులు	వైఎస్సార్‌సీపీ
24.4.24	చోడవరం	కరణం ధర్మశ్రీ	వైఎస్సార్‌సీపీ
24.4.24	అనకాపల్లి	ఎం.భరత్	వైఎస్సార్‌సీపీ
22.4.24	మాడుగుల	బి.అనూరాధ	వైఎస్సార్‌సీపీ
23.4.24	నర్సీపట్నం	పెట్ల ఉమాశంకర్ గణేష్	వైఎస్సార్‌సీపీ
24.4.24	గాజువాక	గుడివాడ అమర్నాథ్	వైఎస్సార్‌సీపీ
18.4.24	యలమంచిలి	ఎస్.విజయకుమార్	జనసేన
19.4.24	పాడేరు	విశ్వేశ్వరరాజు	వైఎస్సార్‌సీపీ
19.4.24	పాడేరు	రమేష్‌నాయుడు	టీడీపీ
19.4.24	రంపచోడవరం	ఎం.శిరీషాదేవి	టీడీపీ
22.4.24	అరకు	ఆర్.మత్స్యలింగం	వైఎస్సార్‌సీపీ
22.4.24	రంపచోడవరం	నాగులాపల్లి ధనలక్ష్మి	వైఎస్సార్‌సీపీ

పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 21న జరగనున్న యూపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, లైజన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశమందిరంలో తపాలా శాఖ పర్యవేక్షకుడు గజేంద్ర కుమార్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 21న ఆదివారం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా 6,347 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందుకు 16 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం ఆరుగురు రూట్ అధికారులను, 16మంది లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఇప్పటికే పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. అభ్యర్థులకు ఏ ఇబ్బంది కలగకుండా అన్ని విభాగాల సిబ్బంది సహకరించాలని కోరారు.

గాలి వానతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



విద్యుత్ లైన్లపై పడిన చెట్టు కొమ్మ

సాక్షి, పాడేరు : గాలి వానతో పాడేరు సమీపంలోని పాలిటెక్నిక్ కొండపైన చెట్టుకొమ్మ విద్యుత్తు లైన్లో విరిగిపడిన సంఘటనతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.. రాత్రి 9 గంటల సమయంలో నిలిచిపోవడంతో పాడేరు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు సిబ్బంది పాడేరు నుంచి ప్రధాన గుత్తులపుట్టు లైన్‌లో తనిఖీలు ప్రారంభించారు. పాలిటెక్నిక్ కొండపై విద్యుత్తు తీగలపై చెట్టుకొమ్మ విరిగి పడి పడిపోవడాన్ని గుర్తించారు. విద్యుత్ సిబ్బంది అతికష్టంతో చెట్టు కొమ్మను తొలగించి రాత్రి 11.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ ,ఆర్‌ఓ ఎస్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 518 ఈవీఎంలు, 518 వీవీ ప్యాడ్లను స్ట్రాంగ్ రూములో భద్రపరిచి సీలు వేసి 24గంటలు పోలీసు భద్రత ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలున్నాయని, 59 మంది సెక్టార్ అధికారులను, 73 మంది రూట్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాయపి. ఈ డెస్క్ లో అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తులు తీసుకోవచ్చన్నారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు కార్యాలయం పని రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించుకోవచ్చన్నారు. అదే విధంగా సిబ్బంది ఒక రోజుకు ముందు తమ బ్యాంక్ అకౌంటు, కొత్తగా తీసుకున్న పాస్ ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. నామినేషన్ సమర్పించే అభ్యర్థితో ఐదుగురిని మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతిస్తామన్నారు. మే 13న జరిగే ఎన్నికలకు మే నెల 12వ తేదీ రంపచోడవరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటుచేసి ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు ఎన్నికల సిబ్బందికి అందజేస్తామన్నారు. అదే విధంగా మే నెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. రెండు గంటలకు ఒకసారి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు తెలియపరిచే విధంగా మండల స్థాయిలో అధికారులను నియమించినట్టు చెప్పారు. గుర్తేడు, పాతకోట పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు రంపచోడవరం స్ట్రాంగ్ రూముకు హెలికాప్టర్‌లో తీసుకొచ్చే విధంగా ప్రతిపాదనలు చేస్తున్నామని, రంపచోడవరంలోని కౌంటింగ్ ఏర్పాటు కొరకు ఎన్నికల సంఘానికి నివేదికలు సమర్పించనున్నట్టు చెప్పారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న పాడేరు ఆర్‌వో భావన వశిష్ట

సాక్షి,పాడేరు: వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 18న విడుదల అయ్యే నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, ఇతర నిబంధనలపై అవగాహనకు గాను పాడేరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జేసీ భావన వశిష్ట మంగళవారం రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.

ఈనెల 24వతేది వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, 26న పరిశీలన ఉంటుందని ,29వతేది మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల విత్‌డ్రాకు గడువు ఉందన్నారు. పాడేరు అసెంబ్లీకి పోటీ చేసే ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు డిపాజిట్ చేయాలన్నారు. నామినేషన్ సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ఇతర అంశాలను సమగ్రంగా వివరించారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ, పోలింగ్, కౌంటింగ్ సమయంలో అమలులో ఉండే ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

41 ఎకరాల్లో జీడితోట దగ్ధం



కాలిపోయిన జీడితోటల వద్ద బాధిత రైతులు

కొయ్యూరు : ఆర్.కొత్తూరు పంచాయతీలో అగ్ని ప్రమాదంలో 41 ఎకరాల జీడితోట కాలిపోయింది. దానిపైనే ఆధారపడిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఎండిన ఆకులపై ఎవరో నిప్పు పెట్టడం మూలంగా మొత్తం తోట కాలిపోయిందన్నారు. దీనిలో మల్లవరానికి చెందిన కూడా జంగమయ్యకు చెందిన పదెకరాలు, కూడా తమ్మయ్యకు చెందిన పదెకరాలు, వరహాలుకు చెందిన పదెకరాలు దగ్ధమైంది. మల్లంపేటకు చెందిన మాతే దేముడుకు చెందిన మూడెకరాలు, కూడా రాంబాబుకు చెందిన ఐదు, మాతే పెంటయ్యకు చెందిన మూడెకరాల జీడితోట దగ్ధమైనట్టు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సారా పట్టివేత-ఇద్దరు అరెస్టు



పట్టుబడిన సారా, నిందితులతో పోలీసులు

చింతపల్లిరూరల్: మండలంలోని అన్నవరం పంచాయతీలో సోమవారం గ్రామంలో 30 లీటర్ల సారాను మంగళవారం స్వాధీనం చేసుకోని ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసినట్లు అన్నవరం ఎస్ఐ రాజారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం గ్రామానికి చెందిన వంతల రాజారావు సారా తయారీ చేయగా, అన్నవరం గ్రామానికి చెందిన సొంటెల శివ అనే వ్యక్తి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దాడుల్లో సారాను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్టు ఎస్ఐ రాజారావు చెప్పారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



జోలాపుట్టులో ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు అందిస్తున్న డీసీహెచ్‌వో కృష్ణారావు

ముంచంగిపుట్టు: వేసవి కాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్‌వో) కృష్ణారావు చెప్పారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతాప్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీహెచ్‌వో కృష్ణారావు రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందించారు.వేసవి కాలంలో ఆరోగ్య పరమైన సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 214 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో డీహైడ్రేషన్ కలుగుతుందని, చెమట ద్వారా నీరు, లవణాలు కోల్పోతామన్నారు. ఎండలో శ్రమతో కూడిన పనులకు దూరంగా ఉండాలని, వడదెబ్బ తగిలే ఆస్కారం ఉంటుందన్నారు. జర్వాలు, గొంతునొప్పి, శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లు వంటివి వస్తాయని తగు జాగ్రత్తలు పాటించాలని, నీరు ఎక్కువగా తాగడం, తేలికపాటి దుస్తులు ధరించాలని సూచించారు. వైద్యాధికారులు శ్యాంప్రసాద్, సంతోష్, లబ్బూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

207 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు

గొలుగొండ: కృష్ణదేవిపేట అల్లూరి పార్కు సమీపంలో మంగళవారం బైక్‌లపై తరలిస్తున్న 207 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు. కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి రెండు బైక్‌లపై గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో కృష్ణదేవిపేట పోలీసులు అప్రమత్తమైనట్టు చెప్పారు. మాటువేసి గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. దీని విలువ రూ.10 లక్షలు ఉంటుందని చెప్పారు. రోలుగుంట మండలం నాయుడుపాలెంకు చెందిన హరిబాబు, అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్రతో పాటు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ హరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



అరకులోయ ఎంపీడీవో వెంకటేష్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న గ్రామ వలంటీర్లు



చికిలింత సచివాలయంలో రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు



కిటుములలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

అరకులోయ రూరల్: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతు పెదలబుడు, బస్కి, సిరగం పంచాయతీల గ్రామ వలంటీర్లు బుజ్జిబాబు,జాన్ని, సన్యాసిరావులు తమ విధులకు రాజీనామాలు చేసి ఎంపీడీవో వెంకటేష్‌కు రాజీనామా పత్రలు అందజేసిన్నట్టు వారు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశపెట్టిన గ్రామవలంటీర్ వ్యవస్థ పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చేసిన విమర్శలకు మనస్థాపం చెందిన రాజీనామా చేశామన్నారు. ఇకపై జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పార్టీకి తమ సేవలందిస్తామన్నారు. అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం గెలుపునకు కృషి చేస్తామన్నారు. మిగిలిన వలంటీర్లు కూడా రాజీనామాలు చేసి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

చింతపల్లిరూరల్: మండలంలో తాజంగి, గొందిపాకల, కిటుముల పంచాయితీలకు సంబంధించిన 40 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో ఎంపీడీవో వీరసాయిబాబుకి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రతిపక్షాల విమర్శలకు మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్టు వారు తెలిపారు. ఇకపై వైఎస్సార్‌సీపీ తరఫున పోటి చేస్తున్న అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు విజయానికి పనిచేస్తామని స్పష్టం చేశారు.



జి.మాడుగులలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామ సచివాయాల పరిధిలో గల 40మంది గ్రామ వలంటీర్లు మంగళవారం ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజీనామ చేసిన వలంటీర్లు మాట్లాడుతూ నిస్వార్థంగా నిరుపేదలకు సేవలు అందిస్తున్న తమపై టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు తొత్తుగా ఉన్న నిమ్మగెడ్డ రమేష్ ఈసీకి ఫిర్యాదు చేసి సేవలకు దూరం చేయడంతో మనస్తాపానికి గురయ్యారు. నిరుపేదలకు సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడతామన్నారు. అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు విజయానికి పనిచేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బిజెపీ, జనసేన మద్దతు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పటానికి గ్రామ వలంటీర్లు సిద్ధంగా ఉన్నారని మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల సేవా గుణంగా ప్రజలు నిస్వార్థంగా అందిస్తుంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో పొత్తు పార్టీలంటికీ తగిన బుద్ధి చెప్పటానికి గ్రామ వలంటీర్లందరూ సిద్ధంగా ఉన్నారన్నారు.



లక్ష్మణ్

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత సచివాలయ పరిధిలో పనిచేస్తున్న మరో ఆరుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మంగళవారం సెక్రటరీకు అందజేశారు. ఇదే పంచాయతీ నుంచి నలుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సోమవారం ఎంపీడీఓ యాదగిరీశ్వరరావుకు అందజేసిన సంగతి విదితమే.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం



సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

- అరకు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం



జోడిగుడలో నాయకులతో ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యలింగం

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. మండలంలోని కంబ్రూం పంచాయతీ సరాయి, జోడిగుడ, కంగ్రూం, లచ్చేరిగుడ, నిశానిగుడ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులను పాలకులు విస్మరించారని, ఏ ప్రాంతంలోనూ అభివృద్ధి పనులు జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గిరిజనులకు ప్రత్యేక పథకాలు అమలుచేశారని, మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజా రాణి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. జోడిగుడ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ బాక ఈశ్వరి, అరకులోయ, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, చిక్కుడు మల్లేశ్వరరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిముడు హరి, పార్టీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, వైస్ ఎంపీపీలు ఆనంద్, పంచాడి లలిత, సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు ,నాయకులు పాపారావు, గణపతి, కృష్ణారావు, వినోద్ కుమార్, పూర్ణ, శత్రుఘ్న, తుంనాథ్ పాల్గొన్నారు.

రేపు గురుకులాల్లో మిగుల సీట్ల భర్తీ

విశాఖ విద్య/ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు విశాఖపట్నంలోని శ్రీకృష్ణాపురం గురుకులంలో ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. విశాఖ జిల్లాలోని శ్రీకృష్ణాపురం, అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం, గొలుగొండ, దేవరాపల్లి గురుకుల పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. విద్యార్థులు తమకు సంబంధించిన అన్ని రకాల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. కౌన్సెలింగ్ ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, మెరిట్‌తో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో సీట్ల భర్తీ జరిగిందన్నారు. శ్రీకృష్ణాపురంలో 22 ఖాళీల్లో ఎస్సీ-20, బీసీ-2, దేవరాపల్లిలో 52 ఖాళీల్లో ఎస్సీ-50, బీసీ-1, ఎస్టీ-1 సీట్లు, గొలుగొండలో 23 ఖాళీల్లో ఎస్సీ-18, బీసీ-2, ఎస్టీ-2, ఎస్టీ-1, సబ్బవరం గురుకులంలో 29 ఖాళీల్లో ఎస్సీ-23, బీసీ-3, ఎస్టీ-2, ఓసీ-1 సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామంలో సోమవారం రాత్రి 3 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఒమ్మి సత్యనారాయణ ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు తెరచి లోపలికి ప్రవేశించి బీరువాలో బంగారు నగలు దొంగిలించుకుపో యారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం.వినోద్ బాబు తెలిపారు.